సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 28 । మార్చి । 2025


I



లైంగిక వేధింపులకు పాల్పడితే శిక్ష తప్పదు IIలో



నిత్యావసర ధరల నియంత్రణపై దృష్టి IIలో



ఏసీఏ అడ్డగోలు దోపిడీ!



ఒక్కో మ్యాచ్‌కు ఒక్కో ధర

గత మ్యాచ్‌లో రూ.వెయ్యి నుంచి రూ.15 వేల వరకు ధరలు

30 నాటి మ్యాచ్‌కి రూ.1,250 నుంచి రూ.20 వేల వరకు పెంపు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: క్రికెట్ ప్రేమికుల ఉత్సాహాన్ని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సొమ్ము చేసుకుంటోంది. ఒక్కో మ్యాచ్‌కు ఒక్కో ధరను వసూలు చేస్తూ దోపిడీకి తెరలేపుతోంది. ఈ నెల 24వ తేదీన జరిగిన ఐపీఎల్ మ్యాచ్ టికెట్లను రూ.వెయ్యి నుంచి రూ.15 వేల వరకు ధర నిర్ణయించి విక్రయాలు చేపట్టింది. ఈ నెల 30వ తేదీన ఢిల్లీ వర్సెస్ హైదరాబాద్ మ్యాచ్‌కు ఒకేసారి టికెట్ల ధరలను పెంచేసింది. రూ.1,250 నుంచి రూ. 20 వేల వరకూ టికెట్ల ధరలను నిర్ణయించింది. టికెట్ల విక్రయాలు కూడా ఒక పద్ధతి ప్రకారం చేపట్టడం లేదు. ఢిల్లీ క్యాపిటల్స్–లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో టికెట్ల అమ్మకాలు కూడా సరిగ్గా జరగలేదు. దీంతో గ్రౌండ్‌లో సగం మంది కూడా ప్రేక్షకులు కనిపించలేదు. ఇటువంటి పరిస్థితుల్లోనూ టికెట్ల విక్రయాల్లో పారదర్శకత పాటించకుండా గుంబనంగా ఇష్టారీతిలో ఏసీఏ పెద్దలు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా పూర్తిగా టీడీపీ నేతలతోనే ఏసీఏ నిండిపోవడంతో తమకు అడ్డేముందనే రీతిలో వీరి ప్రవర్తన ఉందని క్రికెట్ ప్రేమికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయాలు చేపట్టకుండా ఏసీఏ పెద్దలు అంతా లోలోపల వ్యవహారాలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

భారీ ధరలతో క్రికెట్ ప్రేమికులకు నిరాశ

ఆఫ్‌లైన్ విక్రయాలూ నిలుపుదల

బుకింగ్‌కు ముందే ఈ సీట్లన్నీ విక్రయం

ముందు సీట్లన్నీ ఏసీఏ నేతల సన్నిహితులకే..

హడావుడితో అభాసుపాలు

డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండో హోమ్ గ్రౌండ్‌గా ఎంచుకుంది. ఇక్కడ రెండు మ్యాచ్‌లు ఆడాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో స్టేడియాన్ని ఆధునికీకరణ చేయాలని ఏసీఏ భావించింది. ఇందులో భాగంగా స్టేడియానికి గల డాక్టర్ వైఎస్సార్ పేరును తొలగించి విమర్శలు ఎదుర్కొంది. ఆ తర్వాత పేరు తొలగించలేదంటూ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేసింది. టికెట్ల విక్రయాల్లోనూ అదే పంథాను కొనసాగించింది. రెండో మ్యాచ్‌కు అధిక ధరలకు టికెట్లు విక్రయించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తంగా ఏసీఏ వ్యవహారశైలితో క్రికెట్ ప్రేమికులకు నిరాశే మిగులుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

టికెట్ల ధరలు అమాంతం పెంచేశారు

విశాఖలో ఐపీఎల్ టికెట్ల విక్రయాల్లో అడ్డగోలు దోపిడీ జరుగుతోందనే ఆరోపణలున్నాయి. మ్యాచ్ మ్యాచ్‌కు టికెట్ల ధరల్లో వ్యత్యాసం ఉండటంతో పాటు భారీ ధరలతో క్రికెట్ అభిమానులు నిరాశకు లోనవుతున్నారు. గత మ్యాచ్‌లో రూ.వెయ్యి ఉన్న లోయర్ డినామినేషన్ టికెట్ ధరను రూ.1250లకు పెంచారు. బీ స్టాండ్‌లోని రూ.2 వేల టికెట్‌ను రూ.2,500లకు, ఐ, సీ స్టాండ్ రూ.3 వేలు టికెట్ ధరను రూ.4 వేలకు పెంచి విక్రయిస్తున్నారు. ఇక సౌత్ వెస్ట్ అప్పర్, సౌత్ ఈస్ట్ అప్పర్ స్టాండు టికెట్ ధర గత మ్యాచ్‌లో రూ.5 వేలు ఉండగా.. ఇప్పుడు కాస్తా రూ.6 వేలకు పెంచేశారు. ఇక సౌత్ వెస్ట్ లోయర్, సౌత్ ఈస్ట్ లోయర్ ధరలను రూ.10 వేల నుంచి రూ.12 వేలకు అమాంతంగా పెంచి విక్రయిస్తున్నారు. ఇక బాక్సుల ధరలు కాస్తా రూ.15 వేల నుంచి రూ.20వేలకు పెంచేశారు. క్రికెట్ అభిమానాన్ని ఈ విధంగా అడ్డగోలుగా దోచుకునేందుకు ఏసీఏ ప్రయత్నిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ ఇవేవీ సదరు ఏసీఏ కార్యవర్గం పట్టించుకునే స్థితిలో లేకపోవడం గమనార్హం.

రూ.5 వేల టికెట్.. రూ.6 వేలకు విక్రయం

రూ.15 వేల టికెట్ రూ.20 వేలకు పెంపు



అన్నీ ఆన్‌లైన్‌లోనే..!



గతంలో ఏ మ్యాచ్ అయినా ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోను టికెట్ల విక్రయాలు చేపట్టేవారు. ఈ సారి మాత్రం ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయాలు జరగలేదు. గతంలో క్యూలో ఉంటే తమకు టికెట్ దొరుకుతుందనే ఆశతో క్రికెట్ అభిమానులు కొనుగోళ్లకు ఆసక్తి చూపేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఎప్పుడు టికెట్లను విక్రయిస్తారా అని వేచిచూడాల్సి వస్తోంది. ఒకవేళ ఆ సమయానికి సరిగ్గా ఆన్‌లైన్‌లో ఉండి.. టికెట్లను కొనుగోలు చేద్దామంటే మీ కంటే ఇంకా కొన్ని వేల మంది క్యూలో ఉన్నారంటూ వస్తోంది. అంత సమయం ఓపికగా వేచి ఉండి.. టికెట్లను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తే.. ముందు వరుసలోని సీట్లన్నీ అప్పటికే అమ్మకాలు జరిగినట్టుగా చూపెడుతోంది. ఈ ముందు వరుసలోని సీట్లన్నీ ఏసీఏలోని నేతలు వారి అనుచరులకే కట్టబెడుతున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఏకంగా రూ.6 వేలు, రూ.12 వేలు, రూ.20 వేల వరకూ చెల్లించి కొనుగోలు చేసే టికెట్లను కూడా వెనుక వరుసలో ఉండి చూడాల్సి వస్తోందని క్రికెట్ అభిమానులు వాపోతున్నారు. ఫలితంగా అనేక మంది టికెట్లను కొనుగోలు చేయకుండానే ఉండిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే గత మ్యాచ్‌లో గ్రౌండ్ సగం వరకు ఖాళీగా దర్శనమిచ్చింది. ఈ దఫా కూడా ఏసీఏలో ఎటువంటి మార్పు రాలేదని అభిమానులు మండిపడుతున్నారు. అయితే టికెట్ల విక్రయంతో తమకు నేరుగా సంబంధం లేదని.. సదరు ఫ్రాంచైజీలే చూసుకుంటాయంటూ ఏసీఏ నేతలు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

'స్థానిక' ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ
విజయదుందుభి

- ఉమ్మడి విశాఖ జిల్లాల్లో 5 ఎంపీపీ, 2 వైస్ ఎంపీపీ ఎన్నికలు
- 4 ఎంపీపీలు, ఒక వైస్ ఎంపీపీ స్థానాలు వైఎస్సార్ సీపీ కైవసం
- సబ్బవరంలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీల గైర్హాజరుతో వైస్ ఎంపీపీగా స్వతంత్ర అభ్యర్థి విజయం
- ప్రలోభాలకు గురిచేసి జి.మాడుగులలో టీడీపీ ఎంపీపీ ఎన్నిక



మాడుగుల ఎంపీపీ రాజారామ్



ఎస్.రాయవరం ఎంపీపీ వెంకటలక్ష్మి



దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి



మాకవరపాలెం ఎంపీపీ సర్వేశ్వరరావు



చోడవరం వైస్ ఎంపీపీ శరగడం లక్ష్మి

సాక్షి, అనకాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లాలో జరిగిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఉప ఎన్నికల్లో ఫ్యాన్ జోరు పెంచింది. అనకాపల్లి జిల్లాలో 4 ఎంపీపీ, 2 వైస్ ఎంపీపీ స్థానాలకు గానూ 4 ఎంపీపీలు, ఒక వైస్ ఎంపీపీ స్థానాలను వైఎస్సార్ సీపీనే కై వసం చేసుకుని విజయదుందుభి మోగించింది. మరో వైస్ ఎంపీపీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ గైర్హాజరు కావడంతో స్వతంత్ర అభ్యర్థి ఎన్నికయ్యారు. కూటమి నేతలు అధికార బలంతో బెదిరింపులు, ప్రలోభాలకు తెరదీసినా వైఎస్సార్ సీపీలోనే ఉంటాం.. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామంటూ గెలిపించి చూపించారు. బలం లేకపోయినా గెలవాలన్న కూటమి నేతల కుట్రలకు చెక్ పెట్టారు. అనకాపల్లి జిల్లాలో ఎస్.రాయవరం, దేవరాపల్లి, మాకవరపాలెం, మాడుగుల ఎంపీపీలుగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాకవరపాలెంలో ఎంపీపీ ఎన్నిక షెడ్యూల్ ప్రకటించిన మరుక్షణం నుంచి కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలకు ఫోన్‌లు చేసి బెదిరింపులకు పాల్పడడం, ప్రలోభాలకు గురి చేయడం చేశారు. కానీ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో ఎంపీటీసీ సభ్యులందరూ వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారు. మాకవరపాలెం ఎంపీపీ–రుత్తల సర్వేశ్వరరావు(వైఎస్సార్‌సీపీ), ఎస్.రాయవరం ఎంపీపీ–కేసుబోయిన వెంకటలక్ష్మి (వైఎస్సార్‌సీపీ), దేవరాపల్లి ఎంపీపీ–చింతలబుల్లి లక్ష్మి (వైఎస్సార్‌సీపీ) వి.మాడుగుల, తాళ్లపురెడ్డి వెంకటరాజారాం (వైఎస్సార్‌సీపీ) గెలిచారు. చోడవరం వైస్ ఎంపీపీగా శరగడం లక్ష్మి(వైఎస్సార్‌సీపీ), సబ్బవరం వైస్ ఎంపీపీ–మామిడి లక్ష్మి(ఇండిపెండెంట్) గెలుపొందారు.

- సబ్బవరం మండలం వైస్ ఎంపీపీగా గెలిచిన మామిడి లక్ష్మి గతంలో వైఎస్సార్ సీపీలోనే ఎంపీటీసీగా గెలిచారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నుంచి బయటకు వచ్చి స్వంతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. మొత్తం 19 మంది సభ్యులకు వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీలు గైర్హాజరు కావడంతో మిగిలిన 11 మంది ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమెను ఎన్నుకున్నారు.
- పెందుర్తి మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా ముదపాకకు చెందిన ముదపాక శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన రాజయ్యపేట వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు ముదపాక దేవి కుమారుడు. ఇక్కడ వేరెవరూ పోటీకి దిగకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది.
- పెందుర్తి మండలంలోని చింతగట్ల ఉపసర్పంచ్‌గా టీడీపీ నేత గండి బాబ్జీ వర్గానికి చెందిన బొట్టా కనకమహాలక్ష్మి ఉత్కంఠ పోరులో విజేతగా నిలిచారు. ఎమ్మెల్యే పంచకర్ల వర్గానికి చెందిన దమ్ము సుశీల బరిలో నిలవడంతో ఇరువురికీ చెరో 4 ఓట్లు వచ్చాయి. సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి తన ఓటు కనకమహాలక్ష్మికి వేయడంతో బొట్టా గెలుపు ఖాయమైంది.
- సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెం, పైడివాడ అగ్రహారం ఉప సర్పంచ్‌లుగా వైఎస్సార్ సీపీ మద్దతుదారులు సింగంపల్లి దేవి, మడక సరోజిని ఎన్నికయ్యారు.
- అల్లూరి సీతారామరాజు జిల్లాలో జి.మాడుగుల ఎంపీపీగా టీడీపీకి చెందిన లంబోరి అప్పలరాజు గెలుపొందారు.

న్యూస్‌రీల్

30న సింహగిరిపై అప్పన్న పెళ్లిరాట



సింహాచలం: విశ్వావసు నామ ఉగాది సందర్భంగా ఈ నెల 30న సింహగిరిపై శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామివారి పెళ్లిరాట ఉత్సవాన్ని విశేషంగా నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు గురువారం వెల్లడించారు. ఆ రోజు ఉదయం స్వామివారికి విశేష అర్చన, ఉగాది పచ్చడి నివేదన ఉంటాయన్నారు. సాయంత్రం 4 నుంచి ఆలయ ఆస్థాన మండపంలో పంచాంగశ్రవణం నిర్వహిస్తామన్నారు. అనంతరం స్వామివారి పెళ్లిరాట ఉత్సవం జరుగుతుందన్నారు. ఆ తర్వాత పండితులకు సత్కారాలు, దాతలకు విశిష్ట సేవా పురస్కారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 4.30 సమయంలో స్వామి మూలవిరాట్‌పై సూర్యకిరణాలు పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమాల అనంతరం స్వామికి తిరువీధి నిర్వహిస్తామన్నారు.

కేజీహెచ్ అభివృద్ధికి ఎన్టీపీసీ రూ.2 కోట్ల విరాళం



చెక్కును కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు అందిస్తున్న ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ

మహారాణిపేట: విశాఖలోని కింగ్ జార్జ్ ఆస్పత్రి(కేజీహెచ్)లో మౌలిక సదుపాయాల కల్పనకు సింహాద్రి ఎన్టీపీసీ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధుల వినియోగంపై సంస్థ అధికారులు, విశాఖ జిల్లా కలెక్టర్ మధ్య గురువారం ఎంవోయూ కుదిరింది. నెఫ్రాలజీ విభాగంలో ఆరు డయాలసిస్ యూనిట్లు, భావనగర్ వార్డులో నాలుగు యూనిట్లు, ఆపరేషన్ థియేటర్లో ఆధునిక పరికరాల కొనుగోలు, ఇతర సదుపాయాల కల్పనకు ఈ నిధుల్ని వెచ్చించనున్నట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, సంస్థ అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్ఆర్) బి.బి.పాత్ర, సీఎస్సార్ మేనేజర్ కె.ప్రకాశరావు, సీపీవో పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులపై కక్ష

- మానసిక ఆస్పత్రిలో కొనసాగుతున్న పరీక్షలు
- పింఛన్ల కోతకు కూటమి సర్కార్ కుట్ర?



వైద్య పరీక్షం కోసం వేచి ఉన్న దివ్యాంగులు

మహారాణిపేట: నెలకు ఆరు వేల రూపాయల పింఛన్లు తీసుకుంటున్న మానసిక దివ్యాంగులపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల ముందు దివ్యాంగులకు భారీగా పింఛన్లు పెంచుతామని గొప్పలు చెప్పిన ఈ ప్రభుత్వం.. ఇప్పుడు అధికారంలోకి రాగానే లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు కుట్రపూరితంగా సర్వేలు చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు ప్రస్తుతం ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో జరుగుతున్న తనిఖీలే నిదర్శనమని ఆరోపిస్తున్నారు. మానసిక దివ్యాంగులను బలవంతంగా ఆస్పత్రులకు రప్పించి, రాజమండ్రి, కాకినాడ, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులచే పరీక్షలు చేయిస్తున్నారు. ఇప్పటికే సదరం సర్టిఫికెట్లు ఉన్నప్పటికీ.. మళ్లీ మళ్లీ తనిఖీలు నిర్వహించడం దివ్యాంగులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఒకవైపు సదరం సర్టిఫికెట్ల పరిశీలన, మరోవైపు వైద్య పరీక్షల పేరుతో జరుగుతున్న ఈ తతంగాన్ని దివ్యాంగుల పెన్షన్ల కోత కోసమేనని అనుమానిస్తున్నారు.

రోజుకు 20 మంది తనిఖీ : మానసిక ఆస్పత్రిలో సదరం సర్టిఫికెట్ల తనిఖీ కోసం ఒక కౌంటర్ ఏర్పాటు చేశారు. అలాగే ఆస్పత్రిలో మరో మూడు కౌంటర్లు ఏర్పాటు చేసి.. అక్కడ రోగులకు వివిధ పరీక్షలు చేయిస్తున్నారు. రోజుకు 20 మంది రోగులకు చొప్పున తనిఖీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా.. గురువారం 20 మంది మానసిక దివ్యాంగుల సర్టిఫికెట్లను పరిశీలించారు. అనంతరం వైద్యులు వారికి కేటాయించిన శాతంను వివిధ పరీక్షలు చేసి నిర్ధారిస్తున్నారు.

మనోవేదనలో దివ్యాంగులు

చిన్నవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో జరిగిన తనిఖీలకు హాజరైన దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఎన్నో ఏళ్లుగా పింఛన్లు తీసుకుంటున్న తమకు ఇప్పుడు మళ్లీ పరీక్షలు ఎందుకు పెడుతున్నారో అర్థం కావడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. తమ పిల్లల దుస్థితి చూసి బాధపడుతుంటే.. ఇలాంటి చర్యలతో మరింత మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదో కారణం చెప్పి పింఛన్లు తొలగించాలనే దురుద్దేశంతోనే ఈ సర్వేలు, తనిఖీలు నిర్వహిస్తున్నారని ప్రభుత్వంపై మండిపడుతున్నారు. కాగా.. ప్రస్తుతం జిల్లాలో నెలకు రూ.6 వేల పింఛను పొందుతున్న 4,408 మంది మానసిక దివ్యాంగులకు నోటీసులు జారీ చేసి.. పరీక్షలకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 21,306 మంది దివ్యాంగులు, మంచంపై ఉన్న వారిని దశలవారీగా పరిశీలించనున్నారు.



ఆస్పత్రిలో వైద్య పరీక్షల కోసం వేచి ఉన్న మానసిక దివ్యాంగులు, వారి బంధువులు

వయసు పెరుగుతున్నా.. ఎదుగుదల లేదు



మా బాబుకు వయసు పెరుగుతున్నా.. శారీరకంగా, మానసికంగా ఎదుగుదల లేదు. ఇంట్లో ఏ పనీ చేయలేడు. కనీసం అన్నం కూడా తినలేడు. నేను గానీ, నా భర్త గానీ ఇంటి దగ్గర ఉండి బాబుకు అన్నం తినిపించాల్సి వస్తోంది. మా కుమారుడికి పరీక్షలు చేయించడానికి ఇక్కడికి తీసుకొచ్చాం. వైద్యుల సలహా మేరకు మందులు వాడుతున్నాం. ప్రస్తుతం ఇస్తున్న రూ.6 వేలు మందులకు సరిపోవడం లేదు. పింఛన్ మొత్తాన్ని పెంచి మమ్మల్ని ఆదుకోవాలి.

–పద్మశ్రీ, శ్రీనివాస్ తల్లి, జనతాకాలనీ, మల్కాపురం

ఎందుకు రమ్మన్నారో అర్థం కావడం లేదు



మా అమ్మాయి పుట్టుకతో ఎలా ఉందో.. మానసికంగా ఇప్పుడూ అలానే ఉంది. మనిషిలో ఎదుగుదల లేదు. తిండి పెడితే తింటుంది. లేకపోతే లేదు. ఏమీ తెలియదు. స్నానం చేయించడం, దుస్తులు వేయడం, ఆహారం తినిపించడం అన్నీ మేమే చేస్తున్నాం. అమ్మాయిని ఇంత దూరం తీసుకు రావడానికి ఇద్దరం ఉండాల్సి వచ్చింది. వైద్యులు చూస్తారని చెప్పడంతో వచ్చాం. కానీ ఇక్కడికి వచ్చాక ఏదో చెబుతున్నారు. ఏం అర్థం కాలేదు.

– శ్రీనివాస్, వెంకట లక్ష్మి దంపతులు, రామలక్ష్మి తల్లిదండ్రులు, శ్రీహరిపురం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా రెయ్యి వెంకటరమణను నియమించారు. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

రేపు జీవీఎంసీ బడ్జెట్ ప్రత్యేక సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రత్యేక బడ్జెట్ సమావేశం ఈ నెల 29న నిర్వహించనున్నారు. వాస్తవానికి గత నెలలోనే బడ్జెట్ సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడింది. జీవీఎంసీ 2025–26 ఏడాదికి సంబంధించి వార్షిక బడ్జెట్‌కు స్థాయీ సంఘం డిసెంబర్ నెలలోనే ఆమోదం తెలిపింది. జీవీఎంసీ 2025–26 వార్షిక బడ్జెట్ ప్రారంభపు నిల్వ రూ.482.26 కోట్లు, అన్ని పద్దుల కింద జమలు రూ.427.96 కోట్లు, ప్రారంభపు నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.476.18 కోట్లు, అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.460.14 కోట్లు, ముగింపు నిల్వగా రూ.16.04 కోట్లుగా చూపారు.

లోకేష్.. హామీల అమలెప్పుడు?

- స్మార్ట్ మీటర్లతో మా పొట్ట కొట్టొద్దు
- ఏప్రిల్ ఒకటి నుంచి రాష్ట్రవ్యాప్త సమ్మె
- విద్యుత్ మీటర్ రీడర్ల ఆందోళన



ధర్నా చేస్తున్న మీటర్ రీడర్లు

సీతమ్మధార: ఉద్యోగ భద్రత కల్పించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల విద్యుత్ మీటర్ రీడర్లు డిమాండ్ చేశారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్త సమ్మె చేస్తామని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు డిమాండ్ల పత్రం సమర్పించారు. గురుద్వారా వద్ద గల ఈపీడీసీఎల్ జోనల్ కార్యాలయం వద్ద గురువారం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ ధర్నా జరిగింది. విశాఖపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో మీటర్ రీడర్లు పాల్గొన్నారు. ఈ ధర్నానుద్దేశించి సంఘ గౌరవ అధ్యక్షుడు బాల కాశీ, ఏఐటీయూసీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలను విడనాడాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లోకేష్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడి, అధికారంలోకి వస్తే వాటిని రద్దు చేస్తామని, విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి దాదాపు పది నెలలైనా నేటికీ ఆ హామీని అమలు చేయకపోవడం దారుణమన్నారు. గత 15, 20 ఏళ్లుగా సంస్థనే నమ్ముకుని పనిచేస్తున్న తమను స్మార్ట్ మీటర్ల పేరుతో రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అదానీ, అంబానీలకు కొమ్ముకాస్తోందని, విద్యుత్ మీటర్ రీడర్లను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు రామకృష్ణ, శివారెడ్డి, క్రాంతికుమార్, ఎస్.కె.రెహమాన్, మన్మధరావు, రామలింగారెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, శ్రీనివాస్ శేఖర, చిరంజీవి, శ్రీనివాసరావు, నాగబాబు, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

విశాఖలో ఆక్టోపస్ యూనిట్?

మహారాణిపేట: అనుకోని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.హెచ్.భవానీ శంకర్ సూచించారు. అగ్ని ప్రమాదాలు, టెర్రరిస్టుల దాడుల విషయంలో అలారం వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. టెర్రరిస్టు దాడులు, ఇతర ఆపదలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆక్టోపస్ రాష్ట్ర ఆపరేషన్ అధికారి డీఎస్పీ జగ్గునాయుడు, డీఎస్పీ మధుసూదనరావు ఆ సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. ఊహించని ప్రమాదాల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఆక్టోపస్ పని చేస్తోందని, రాష్ట్రంలోని తిరుపతి, గన్నవరం కేంద్రాలుగా రెండు ఆపరేషన్ యూనిట్లు ఉన్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో మూడో యూనిట్‌ను నెలకొల్పేందుకు యోచిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆక్టోపస్ శిక్షణ, ఇతర కార్యక్రమాలకు సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. ఏపీలోనిఆక్టోపస్ మిగతా రాష్ట్రాల్లోని సంస్థల కంటే భిన్నంగా సేవలందిస్తోందని గుర్తు చేశారు. ఆక్టోపస్ ఆపరేషన్ టీం అధికారులు, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, ఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు, అగ్నిమాపక శాఖ ఏడీఎఫ్‌వో సింహాచలం, అధికారులు పాల్గొన్నారు.

విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలు నేడు



పోలింగ్ బాక్స్‌లను తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారి జీఎం రెడ్డి,ఇతర అధికారులు

విశాఖ లీగల్: ప్రతిష్టాత్మకమైన విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఎన్నికల్లో 2,958 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వివిధ పదవులకు సంబంధించి ఆరు రంగుల బ్యాలెట్ పేపర్లను తయారు చేశారు. న్యాయవాదులందరూ బ్యాలెట్ పేపర్లను ఆ రంగు పెట్టెలో వేయాలని ఎన్నికల అధికారి, ప్రముఖ న్యాయవాది జీఎం రెడ్డి కోరారు. న్యాయవాదుల అనుభవాన్ని బట్టి ఆరు పోలింగ్ బూతులను ఏర్పాటు చేశారు. ఒక్కో బూతులో ఒకేసారి ఐదుగురు అభ్యర్థులు ఓటు వేయడానికి అవకాశం ఉంది. సాయంత్రం 6 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై 10 గంటలకు ముగుస్తుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల్లో పోటీ చేసే ప్రధాన అభ్యర్థులు రాజకీయ పార్టీల పేరుతో ప్రచారం చేయడం కొసమెరుపు.

మత్స్యకారులే సముద్ర సంపద పరిరక్షకులు

- ఎఫ్ఎస్ఐ విశాఖ జోన్ డైరెక్టర్ భామిరెడ్డి

సాక్షి, విశాఖపట్నం : సముద్రాన్ని పరిరక్షిస్తూ.. మత్స్య సంపదతో పాటు జీవవైవిధ్యాన్ని కాపాడుతోంది మత్స్యకారులేనని ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఐ) వైజాగ్ జోన్ డైరెక్టర్ భామిరెడ్డి అన్నారు. ఎఫ్ఎస్ఐ విశాఖ కార్యాలయాన్ని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న మెరైన్ మ్యూజియంలో సముద్ర జీవజాలాన్ని ఆసక్తిగా తిలకించారు. జోన్ డైరెక్టర్ భామిరెడ్డి.. వీరితో ముఖాముఖి మాట్లాడుతూ సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతుండటంతో సముద్ర వాతావరణానికి విఘాతం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యర్థాల్ని తొలగించే బాధ్యతపై అవగాహన కల్పిస్తూ ఎఫ్ఎస్ఐ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ముఖ్యంగా ఘోస్ట్ ఫిషింగ్ హాట్‌స్పాట్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు దాదాపు 400 నాటికల్ మైళ్ల దూరంలో నౌకలు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎఫ్ఎస్ఐ విశాఖ జోన్ డైరెక్టర్ భామిరెడ్డి

సర్వే చేసినప్పుడు దొరికిన వలల వ్యర్థాలు చేస్తున్న కీడుకి సంబంధించిన వీడియోల్ని మత్స్యకారులకు చూపిస్తూ.. చైతన్యవంతుల్ని చేస్తున్నామని వివరించారు. తమ సంస్థ చేపట్టిన కార్యక్రమాలకు ఆకర్షితులై.. కొందరు మత్స్యకారులు సముద్ర జీవవైవిధ్యాన్ని కాపాడుకునే బాధ్యతని తమ భుజస్కందాలపైకి ఎత్తుకున్నారని తెలిపారు. మత్స్యకారులతో పాటు.. సందర్శకులు, సామాన్య పౌరులు కూడా సముద్రాలు కాలుష్యం కాకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎఫ్ఎస్ఐ శాస్త్రవేత్త జీవీఏ ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్లలైన కలలు

- పిల్లల కోసం ఫెర్టిలిటీ సెంటర్‌ను ఆశ్రయించిన భార్యాభర్తలు
- 8వ నెలలో కవలలతో సహా తల్లి మృతి
- ముగ్గురి ప్రాణాల విలువ రూ.4 లక్షలు కట్టిన ఆస్పత్రి యాజమాన్యం

దాబాగార్డెన్స్: పిల్లల కోసం కలలు కన్న ఒక నిరుపేద దంపతులకు ఫెర్టిలిటీ సెంటర్ తీరని దుఃఖాన్ని మిగిల్చింది. ఇందుకోసం తొమ్మిది లక్షల రూపాయలు ఖర్చు చేసినా ఫలితం లేకపోగా.. కడుపులో పెరుగుతున్న కవలలతో సహా తల్లి కూడా మృతి చెందడం ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. ఆ ముగ్గురు ప్రాణాల విలువను రూ.4 లక్షలుగా వెలకట్టి ఆస్పత్రి యాజమాన్యం చేతులు దులుపుకుంది. బాధితుడు తెలిపిన వివరాలివి..

అనకాపల్లి జిల్లా మాకవరపాలెం ఎస్సీ కాలనీకి చెందిన గెంజి వరహాలు బాబు ఓ కంపెనీలో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఎనిమిదేళ్ల కిందట లక్ష్మితో అతనికి వివాహం జరిగింది. పిల్లలు లేకపోవడంతో బాధపడుతున్న వరహాలు బాబుకు.. అదే కంపెనీలోని ఒక సహోద్యోగి రామ్‌నగర్‌లోని ఆరాధ్య ఆస్పత్రి గురించి చెప్పాడు. అక్కడ చికిత్స తీసుకుంటే పిల్లలు పుడతారని చెప్పడంతో.. వరహాలు బాబు, లక్ష్మి దంపతులు ఎనిమిది నెలల కిందట ఆరాధ్య ఆస్పత్రిని సంప్రదించారు. ప్రారంభంలో ఆస్పత్రి యాజమాన్యం రూ.2,25,000 ఖర్చు అవుతుందని చెప్పగా.. తమ ఆర్థిక పరిస్థితిని వివరించడంతో రూ.2,10,000కు అంగీకరించింది. వరహాలు బాబు పరీక్షల కోసం మరో రూ.12 వేలు చెల్లించాడు. పరీక్షలు పూర్తయ్యాయి. లక్ష్మికి రూ.12 రోజుల పాటు రోజుకు ఒక ఇంజక్షన్ చొప్పున 12 ఇంజక్షన్లు వేశారు. అప్పటి నుంచి ప్రతి నెలా పరీక్షల కోసం మాకవరపాలెం నుంచి నగరానికి వెళ్లొస్తూ ఉండేవారు. ప్రయాణాలు, వైద్య ఖర్చులు, మందులు, స్కానింగ్‌ల కోసం నెలకు దాదాపు రూ.


లక్ష్మి మృతదేహం

20 వేల వరకు ఖర్చు చేసేవారు. నాలుగో నెలలో లక్ష్మి గర్భంలో ముగ్గురు పిల్లలు ఉన్నారని వైద్యులు చెప్పడంతో సంతోషించిన ఆ దంపతులు.. ఇద్దరు పిల్లలు చాలని కోరారు. దీంతో వైద్యులు ఒక పిండాన్ని తొలగించారు. ఆ తర్వాత ఆరు నెలల వరకు తల్లి, పిల్లలు ఆరోగ్యంగానే ఉన్నారు. 7వ నెలలో నిర్వహించిన పరీక్షల్లో లక్ష్మికి మధుమేహం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వైద్యుల సూచనల మేరకు


చనిపోయిన ఇద్దరు పిల్లలను పూడ్చి పెడుతున్న తండ్రి వరహాలు బాబు

ఆహార నియమాలు పాటించినప్పటికీ.. సరైన పోషకాహారం లేక పిల్లల ఎదుగుదల సరిగా లేకపోయింది. దీంతో ఆస్పత్రి చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

ముందే చెప్పి ఉంటే..

కాగా.. గత ఆదివారం రాత్రి లక్ష్మికి తీవ్రమైన విరేచనాలు మొదలయ్యాయి. సోమవారం ఉదయం వరకు అవి ఆగకపోవడంతో ఆందోళన చెందిన వరహాలు ఆస్పత్రికి ఫోన్ చేసినా స్పందన రాలేదు. ఉదయం 8 గంటల తర్వాత స్పందించిన సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. మధ్యాహ్నానికి ఆస్పత్రికి చేరుకున్న లక్ష్మిని మొదట 6వ అంతస్తులో, తర్వాత 3వ అంతస్తుకు మార్చారు. పరిస్థితి విషమించడంతో స్కానింగ్ చేయగా కడుపులో ఇద్దరు పిల్లలు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పిల్లలు చనిపోయినా భార్యను కాపాడమని వేడుకున్న వరహాలు బాబుకు చెప్పకుండానే అదే రోజు రాత్రి లక్ష్మిని అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం లక్ష్మి తుదిశ్వాస విడిచింది. భార్యను, కడుపులోని ఇద్దరు పిల్లలను కోల్పోయిన వరహాలు బాబు కన్నీరుమున్నీరుగా విలపించాడు. పిల్లల కోసం వస్తే.. పిల్లలతో పాటు భార్యా దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తన ఆవేదనను చూసి కుటుంబ సభ్యులు ఆస్పత్రి యాజమాన్యాన్ని నిలదీస్తే.. ముగ్గురి ప్రాణాలకు కలిపి రూ.4 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకుందని ఆరోపించాడు. ప్రతి నెలా పరీక్షలు చేస్తూ లక్షలు వసూలు చేసిన యాజమాన్యం.. చివరికి తల్లి శరీరం సహకరించడం లేదని చెప్పడం దారుణమని వరహాలు బాబు తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. ముందే చెప్పి ఉంటే ఈ ప్రయత్నమే చేసేవాళ్లం కాదని, ముగ్గురు ప్రాణాలను రూ.4 లక్షలకు వెలకట్టడం దారుణమని ఆమె రోదించింది.

నేడు, రేపు మెగా జాబ్ మేళా

దాబాగార్డెన్స్: ఈ నెల 28, 29 తేదీల్లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ సీఈవో వంశీకృష్ణ తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు జాబ్‌మేళాకు నేరుగా హాజరుకావచ్చని పేర్కొన్నారు. ట్రియాజ్, బీఎస్‌సీ సంస్థలు సంయుక్తంగా మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో గల ఫ్యాబ్ ఇండియా భవనంలోని సంస్థ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు చెప్పారు. విజయవాడ, నెల్లూరు, హైదరాబాద్ నగరాల్లో పనిచేయడానికి ఆసక్తి కలిగి, అర్హులైన వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు. వివరాలకు 92924 58992, 9888797804లో సంప్రదించవచ్చు.

నిర్మాణ పనులు పూర్తి చేయండి

విశాఖ సిటీ: మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్ తుది దశ పనులను వేగంగా పూర్తి చేసి సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఆయన గురువారం సిరిపురంలోని మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ భవన నిర్మాణ, పచ్చదనం పనులను పరిశీలించారు. సత్వరమే పనులు పూర్తి చేయాలని చెప్పారు.

ఓజోన్ వ్యాలీలో అక్రమాలపై చర్యలకు రంగం సిద్ధం

మధురవాడ : మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు.127 ఓజోన్ వ్యాలీలో వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన ఫేజ్-1, 2తోపాటు ఇతర లే అవుట్‌ల్లో 2013లో నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపు జరిగిందని ప్రభుత్వం నిర్ధారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ చేసేందుకు విశాఖపట్నం ఆర్‌డీఎంఏ వి.రవీంద్రని విచారణ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వ జీవో విడుదల చేసింది. ఈ వ్యవహారంపై ఎస్టేట్ వింగ్‌లో ఏవోగా పనిచేసిన లక్ష్మీ నరసింహమూర్తి సహా మరో ఆరుగురిపై విచారణ చేసి చర్యలకు రంగం సిద్ధం చేసింది.

మద్యం.. తీసింది ప్రాణం

- భవనంపై నుంచి జారిపడి తెలంగాణ వాసి మృతి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ ప్రాంతంలోని భవనంపై నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లికి చెందిన తవిడిబోయిన సతీష్ (35) భవన నిర్మాణాల్లో గ్రానైట్ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన పది మంది బృందంగా ఏర్పడి రుషికొండకు వలస వచ్చారు. ఈ నెల 23న రుషికొండ స్వర్ణభారతి నగర్‌లో ఓ భవనం 4వ అంతస్తుపై ఇల్లు అద్దెకు తీసుకుని దిగారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గ్రానైట్ పనులు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. కాగా.. వీరంతా బుధవారం రాత్రి గది బయట బాల్కనీలో మద్యం సేవించారు. రేచీకటి సమస్య ఉన్న సతీష్ మద్యం మత్తులో అర్ధరాత్రి 12 గంటలకు భవనం గోడ వద్దకు వెళ్లి.. ప్రమాదవశాత్తు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై సహచరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.


సతీష్ మృతదేహం

విశాఖ- చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు స్టేషన్ల నుంచి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖ-చర్లపల్లి(08579) స్పెషల్ ఈ నెల 28, ఏప్రిల్ 1వ తేదీల్లో సాయంత్రం 5.35 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. చర్లపల్లి-విశాఖ(08580) స్పెషల్ ఈ నెల 29, ఏప్రిల్ 2వ తేదీల్లో ఉదయం 8 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 10 గంటలకు విశాఖ చేరుకుంటుంది. విశాఖ-సంత్రగచ్చి (08577) స్పెషల్ ఈ నెల 29, ఏప్రిల్ 2వ తేదీల్లో రాత్రి 11.45గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. సంత్రగచ్చి-విశాఖ (08578) స్పెషల్ ఈ నెల 30, ఏప్రిల్ 3న సాయంత్రం 6.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.45 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

మేయర్‌గా హరి వెంకటకుమారినే కొనసాగించాలి

- జిల్లా యాదవ సంఘం డిమాండ్

సీతమ్మధార: జీవీఎంసీ మేయర్‌గా ప్రస్తుత మేయర్ హరి వెంకట కుమారిని కొనసాగించాలని, జీవీఎంసీ పాలకమండలిలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే మేయర్ స్థానాన్ని యాదవులకే కేటాయించాలని యాదవ ఐక్య వేదిక జాతీయ కన్వీనర్ అల్సి అప్పలనారాయణ విజ్ఞప్తి చేశారు. విశాఖ జిల్లా యాదవ సంఘం నేతృత్వంలో గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అప్పలనారాయణ మీడియాతో మాట్లాడారు. యాదవ సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని, విశాఖలో ఉన్న ఒక్క మేయర్ పదవిని కూడా తొలగించాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం యాదవులను కించపరిచేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మేయర్ విషయంలో


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విశాఖ జిల్లా యాదవ సంఘం

అన్యాయం జరిగితే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. యాదవులను బీసీ-డీ నుంచి బీసీ-బీకి మార్చాలని డిమాండ్ చేశారు. జాతీయ యాదవ హక్కుల సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడిబోయిన బాబ్జీ యాదవ్, భారత చైతన్య యువజన పార్టీ తూర్పు సమన్వయకర్త ఎడ్ల వేణుగోపాల్, యాదవ జిల్లా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే శిక్ష తప్పదు

- పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలి
- జిల్లా న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ విద్య: లైంగిక వేధింపులకు పాల్పడితే శిక్షలు కఠినంగా ఉంటాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. గురువారం ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఏయూ సంయుక్తంగా నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. చిన్నారులను లైంగిక వేధింపులు, దాడుల నుంచి రక్షించడానికి పోక్సో చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. నేరానికి పాల్పడిన వారు మైనర్ అయినా శిక్ష తప్పదన్నారు. పోక్సో కేసులో జీవిత ఖైదు, 20 సంవత్సరాల వరకు శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. మైనర్ పట్ల అంగీకారంతో అనుచితంగా ప్రవర్తించినా అది నేరం కిందే వస్తుందన్నారు.
ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ విభిన్న సామాజిక అంశాలపై విద్యార్థులను చైతన్యం చేసేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయి చిన్న కుటుంబాలు ఏర్పడడంతో కొన్ని సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నార. యువత నేరపూరిత చర్యలలో భాగమై తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.
ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వెంకట శేషమ్మ, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరి పోక్సో చట్టాన్ని విపులంగా వివరించారు. ఏడీసీపీ మోహనరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ జి.జయదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

షాపింగ్‌కు డబ్బులు ఇవ్వలేదని భార్య ఆత్మహత్యాయత్నం

మధురవాడ: షాపింగ్, ఇతర ఖర్చుల కోసం భర్త డబ్బులు ఇవ్వలేదని ఓ వివాహిత మేడపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పీఎంపాలెం ఎస్ఐ భాస్కరరావు చాకచక్యంగా వ్యవహరించి ఆమెను రక్షించారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వివరాలివి.. మధురవాడ సమీపంలోని వైఎస్సార్ జేఎన్ఎన్‌యూఆర్ కాలనీ 24వ బ్లాక్ టీఎఫ్-1లో ఒబ్బిన వెంకటరమణ, సూరి దంపతులు నివాసం ఉంటున్నారు. వెంకటరమణ తాపీమేస్త్రిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో భార్య సూరి, కుమార్తె షాపింగ్, ఇతర అవసరాల కోసం అతనికి డబ్బులు అడిగారు. అతను కుమార్తెకు డబ్బులు ఇచ్చి భార్యకు ఇవ్వలేదు. దీంతో ఆవేదన చెందిన సూరి మూడవ అంతస్తుపై మేడ మీదకు వెళ్లి.. అక్కడ నుంచి షన్‌షేడ్ మీదకు దిగింది. అక్కడి నుంచి కిందకు దూకేస్తానంటూ కూర్చుంది. దీంతో స్థానికులు పీఎంపాలెం పోలీసులకు సమాచారం ఇవ్వగా.. సబ్ ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకున్నారు. డబ్బులు ఇప్పిస్తానని మాటల్లో పెట్టి.. మేడపై నుంచి ఆమె చేయి అందుకుని స్థానికుల సహాయంతో పైకి లాగారు. ఎస్ఐ భాస్కరావు చాకచక్యంగా వ్యవహరించి.. మహిళను రక్షించిన తీరును స్థానికులు అభినందించారు. భార్యాభర్తలిద్దరినీ స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు.


వివాహితను రక్షించేందుకు ప్రయత్నిస్తున్న ఎస్ఐ

నిత్యావసర ధరల నియంత్రణపై దృష్టి

మహారాణిపేట: మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, వినియోగదారుల అవసరాల మేరకు నిల్వలను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీసీ హాలులో జిల్లా ధరల నియంత్రణ కమిటీ సభ్యులతో సమావేశమైన ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రస్తుతం పప్పులు, బియ్యం ధరలు అధికంగా ఉన్నాయని వాటిని నియంత్రించే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. మార్కెట్ స్థితిగతులను అంచనా వేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతు బజార్లు, బయట మార్కెట్లలో ధరలను పరిశీలించాలని సూచించారు. రైతు బజార్లలో ప్రస్తుతం ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బియ్యం, పప్పు దినుసుల కేంద్రాల సేవలపై ఆరా తీసిన ఆయన బయట మార్కెట్లో కూడా ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కల్యాణి, మార్కెటింగ్ ఏడీ యాసిన్, హార్టికల్చర్, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు, ధరల నియంత్రణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

370కి చేరిన స్టాఫ్ నర్సుల పోస్టులు

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల సంఖ్య గణనీయంగా పెరిగింది. తొలుత ఉత్తరాంధ్రలోని 6 జిల్లాల్లో 106 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రస్తుతం పలు మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆస్పత్రులకు నర్సుల పోస్టులు అదనంగా 264 చేరాయి. దీంతో మొత్తం 370 పోస్టుల భర్తీకి వైద్య ఆరోగ్య ప్రాంతీయ డైరెక్టర్(ఆర్‌డీ) కార్యాలయం శ్రీకారం చుట్టింది.

ఈ పోస్టులకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో వచ్చిన సుమారు 8,300 దరఖాస్తులను పరిశీలించి, జనవరి 27న ప్రొవిజినల్ జాబితా విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనిపై అభ్యంతరాలను ఆహ్వానించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జాబితా పరిశీలన నిలిచిపోయింది. ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో మళ్లీ జాబితా పరిశీలన మొదలు పెట్టారు. ఇంతలో పోస్టుల సంఖ్య పెరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో కొత్తగా వచ్చిన మెడికల్ కాలేజీలు, కేజీహెచ్, రాణీ చంద్రమతీదేవి ఆస్పత్రి, శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రి, విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రి, పాడేరు ప్రభుత్వ ఆస్పత్రి, క్యాన్సర్ వార్డుకు అదనంగా నర్సుల పోస్టుల మంజూరు, రిటైర్డ్ ఖాళీలను కూడా కలిపి, భర్తీ చేయనున్నారు. మరో మూడు రోజుల్లో పోస్టులకు సంబంధించి ఫైనల్ జాబితా విడుదల చేయనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ ఆర్‌డీ రాధారాణి గురువారం సాక్షికి తెలిపారు. దీనిపై కూడా అభ్యంతరాలు తెలియజేయవచ్చని, వాటిని పరిశీలించి, పరిష్కరించాకే రోస్టర్ మేరకు తుది జాబితాను వెల్లడిస్తామన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన


ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు

విశాఖ విద్య: పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై అనుమానాలున్నాయని, న్యాయ విచారణ జరిపి, వాస్తవాలను బహిర్గతం చేయాలంటూ ఏయూ నాన్‌టీచింగ్ సిబ్బంది, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు ఏయూ మెయిన్ గేట్ వద్ద గురువారం సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్ పోస్టర్లను చేతపట్టుకుని నినాదాలు చేశారు. పాస్టర్ ప్రవీణ్ మరణంపై ప్రభుత్వం తక్షణమే విచారణ చేపట్టాలన్నారు.

తెలుగు నాటకాలకు అంతర్జాతీయ ఖ్యాతి తేవాలి

- మంత్రి కందుల దుర్గేష్ పిలుపు

మద్దిలపాలెం: మన సంస్కృతిలో భాగమైన తెలుగు నాటకాలకు జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకువచ్చేలా కళాకారులు కృషి చేయాలని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ నాటక దినోత్సవం సందర్భంగా కళాభారతి ఆడిటోరియంలో రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం 'లీడర్ విశాఖ జాతీయ నాటకోత్సవాలు-2025' ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు నాటకాలను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టేందుకు ఇలాంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. ఏప్రిల్ 16న కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా తెలుగు నాటక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున జాతీయ స్థాయిలో ఈ తరహా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాను ఆరు నెలల్లో రాష్ట్రానికి తీసుకువస్తామన్నారు. ఈ ఏడాది నాటకాలకు, సినిమాలకు నంది అవార్డులు అందజేస్తామని ప్రకటించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తెలుగు నాటక రంగానికి బళ్లారి రాఘవ చేసిన సేవలను కొనియాడారు. విశాఖలో కళాపోషకులు, కళా ప్రియులు, కళాకారులు ఉన్నారని ఆనందం వ్యక్తం చేశారు. 60 ఏళ్లకు పైగా హీరోయిన్‌గా పలు నాటకాల్లో నటించిన విజయలక్ష్మికి అవార్డు అందజేయాల్సి ఉండగా.. ఆమె రాకపోవడంతో చలసాని కృష్ణప్రసాద్‌కు మంత్రి దుర్గేష్ అందజేశారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ జి.ఎస్.ఎన్. రాజు, నాటకాల ఎంపిక కమిటీ సభ్యుడు శివప్రసాద్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శించిన గుజరాతీ నాటకం 'ఐటెం'ఆకట్టుకుంది. భాషాపరమైన ఇబ్బంది ఉన్నప్పటికీ.. నటుల ప్రదర్శనకు ప్రేక్షకులు జేజేలు పలికారు. రచయిత, దర్శకుడు అర్పిల్ దాగత్, నటులను మంత్రి దుర్గేష్ సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.


మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్